విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

తోకాడ చెరువుకు గండి - మునిగిన జగనన్న కాలనీలు

- వ్యక్తిగత ప్రయోజనాలే కారణమా?
- కొట్టుకుపోయిన పశువులు, ధాన్యం రాశులు
- గంగార్పణమైన పంట పొలాలు
- నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్

విశాలాంధ్ర - రాజానగరం : అభివృద్ధి పనుల పేరుతో తోకాడ చెరువుకు గండి కొట్టడంతో మండలంలోని మల్లంపూడి గ్రామంలోని జగనన్న కాలనీ జలమయమైంది. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.మండలంలోని తోకాడ గ్రామంలోని ఊర చెరువును అభివృద్ధి చేసేందుకు చెరువులో నీటిని తీసివేసేందుకు చెరువుకు ఒక కాంట్రాక్టర్ గండి కొట్టించారు అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం తోకాడ గ్రామంలోని ఊర చెరువులో ఒకవైపు సుమారు 15 అడుగుల లోతు గట్టును జెసిబీ సాయంతో తొలగించారు. దీంతో చెరువులోని నీరు ఆ సమీప గ్రామమైన మల్లంపూడి లోని జగనన్నకాలనీని ముంచెత్తింది. దీంతో కాలనీలో అరకొరగా ఏర్పాటు చేసుకున్న ఇళ్లలో నివాసం ఉంటున్న కాలనీవాసులు దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడారు.మరో వైపు పంటపొలాలు గంగార్పణమయ్యాయి. వరి పంట కోతలు పూర్తి అవ్వడంతో చేలల్లో ఉన్న ధాన్యం రాశులు సుమారు 50 బస్తాల ధాన్యం కొట్టుకుపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటిలాగానే తమ గేదెలను పొలాల్లో కట్టేశామని ఒక్కసారే గండి నీరు రావడంతో తమ పశువులు కనిపించడం లేదని, దాదాపు 50 వేల రూపాయల గేదే మృతిచెంది వుండవచ్చని కన్నీరు మున్నీరయ్యారు. చెరువు అభివృద్ధి పనులా లేక వ్యక్తిగత ప్రయోజనాల అంటూ మహిళలు మండిపడ్డారు.

చెరువుకు గండికొట్టిన వాళ్లపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామ కృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. గండికొట్టడం వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని తిరుమాలి గ్రామంలో ప్రత్తిపాడు సిఐ శేఖర్ బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై సతీష్ బాబు నేతృత్వంలోని పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ప్రగతి పథంలో మెలగాలని అన్నారు. అంతేకాకుండా మోటార్ సైకిళ్ళపై ప్రయాణాలు చేసేటప్పుడు తలకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. ప్రయాణాల సమయంలో మహిళలు దిశా యాప్ను తప్పకుండా ఉపయోగించాలని ఆయన అన్నారు. ఈ పరివర్తన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12న దీపోత్సవం

విశాలాంధ్ర - ఐ పోలవరం : మురమళ్ల నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామివారి ఆలయంలో కార్తీక మాసం ఆఖరు రోజు అమావాస్య మంగళవారం పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన దీపోత్సవ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. పవిత్ర కార్తీక మాసంలో దీపానికి అత్యత ప్రాధాన్యత ఉందని లింగాకారం, శివుడు పార్వతి, కైలాసం తలపించే మంచుకొండలతో భారీ ఆకృతి ఇప్పటికే రూపుదిద్దుకున్నాయని భక్తులు దీపాలు వెలిగించుకొనేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దీపోత్సవ మహోత్సవం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరులో స్థానిక భువనేశ్వరి చెరువుగట్టు వద్ద అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపం అభివృద్ధికి, అదే గ్రామానికి చెందిన కోలా వెంకటేశ్వర రావు, కుమారులు నాని, కృష్ణరాజు కలిసి తమ వంతు సహాయంగా 50వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వైఎస్ఆర్సిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, మండల కాపు సంఘం అధ్యక్షులు, డాక్టర్ చల్లా ప్రభాకరరావుకు కాపు సంఘం సభ్యులు సమక్షంలో మొత్తం నగదును అందజేశారు. అధ్యక్షులు రామానుజుల శేషయ్య, అధ్యక్షులు చల్లా నానాజీ, సిరిగినేడి పట్టాభి, సత్యనారాయణ, గంటా వీర్రాజు, వీర్రాజు, ఎలుగుబంట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత భవిష్యత్తుకు కరాటే దోహదం

విశాలాంధ్ర - సామర్లకోట : విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు, ఆత్మరక్షణకు కరాటే క్రీడ ఎంతో దోహదపడుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా మొదటి వైస్ గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్, కరాటే ఇండియా చీఫ్, ఆంధ్ర, తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఆర్.మల్లి కార్జున గౌడ్ అన్నారు. సామర్లకోట పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లో గల డిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ భీమేశ్వర సామర్లకోట లయన్స్‌క్లబ్ సౌజన్యంతో రెండవ జాతీయస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక కరాటే కోచ్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను తొలుత ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వ్యాయామం ఆత్మ రక్షణ క్రీడల్లో ప్రవేశం ఎంతైనా అవసరం ఉందన్నారు. కరాటే క్రీడలో సంపాదించు కున్న సర్టిఫికెట్ల ద్వారా విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును పొందగలరన్నారు. క్రీడల్లో రాణించడం ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయం అయినప్పటికీ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా స్థానిక కోర్ట్ శంకర్ ఉచితంగా కాకినాడ నగరం నుంచి విచ్చేసి విద్యార్థులకు ఆత్మ రక్షణ శిక్షణలు కరాటే క్రీడ ద్వారా అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కరాటే పోటీలను ముఖ్య అతిథులు ఈశ్వర కుమార్, మల్లికార్జున గౌడ్లు ప్రారంభించారు. తొమ్మిది రాష్ట్రాల నుండి సుమారు 800 మంది విద్యార్థులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా వారి అత్యంత ప్రతిభను కనబరిచి పథకాలు సాధించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా పథకాలు సర్టిఫికెట్లను, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో చిన్నారుల కూచిపూడి నిత్య ప్రదర్శనలు ప్రజల నాకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూరు వీర్రాజు (రాజా), లయన్స్ రీజనల్ చైర్మన్ చిత్తులూరి శ్రీదేవి, జోన్ చైర్మన్ గణేష్ ప్రసాద్, భారత్ మాత సేవ పరిషత్ అధ్యక్షులు గోరకపూడి చిన్నయ్య దొర అడిషనల్ డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ ఎం. శివ నాగ కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు మేకా శ్రీనివాసరావు, అధ్యక్షులు కె.విజయ కృష్ణారావు, కార్యదర్శి ఎస్ఆర్వైవి రామలింగ ప్రసాద్, కోశాధికారి డి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర - సామర్లకోట : విజన్ ఎమర్జెన్సీ, 24/7 మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎముక సాంద్రత, న్యూరోపతి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నామని డాక్టర్ మహోన్నత తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెడికల్ క్యాంపు ద్వారా ఎముక సాంద్రత పరీక్ష ప్రయోజనాలు ఫ్యాక్టర్ సంభవించే ముందు ఎముకల వ్యాధిని గుర్తించుట, భవిష్యత్తులో ఫ్యాక్టర్ వచ్చే అవకాశాన్ని ముందుగా గుర్తించడం ఎముక యొక్క స్థితి, అవసరమైన చికిత్సను పర్యవేక్షించవచ్చు న్యూరోపతి సంకేతాలలో భాగంగా పాదాలలో జలదరింపు, నొప్పి, తిమ్మిరి, కండరాల బలహీనత, తాకినపుడు ఇబ్బంది, అదుపు తప్పడం, అంతేకాకుండా రూ.12000 విలువ గల ఎముక సాంద్రత, నెర్వ్ కండక్షన్ పరీక్షలు పూర్తిగా ఉచితంగా సామర్లకోటలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉ. 10 గం. నుండి సా. 5. గం వరకు నిర్వహిస్తున్నట్టు విజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ మహోన్నత తెలియజేశారు. ఈ అవకాశం అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

సృజనాత్మకతను చాటేందుకు టాలెంట్‌టెస్టులు

విశాలాంధ్ర - అనపర్తి : సృజనాత్మకతను చాటేందుకు టాలెంట్ టెస్టులు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీ రామకృష్ణ సేవా సమితి, జిబిఆర్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద టాలెంట్ టెస్ట్-2023 బహుమతి, పురస్కార ప్రదానోత్సవం జిబిఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో సేవ సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల 8 మండలాల పరిధిలో 60 పాఠశాలల 10 వ తరగతి విద్యార్థులు 1800 మందికి నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన 180 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, స్వామీజీ సాహిత్యం, మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులుగా 1వేయి,600,400 నగదు, ప్రశంస పత్రం, స్వామీజీ సాహిత్యం, జ్ఞాపిక అందించారు. 8 మండలాల పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గొల్లల మామిడాడకు చెందిన కట్టా వీర దుర్గా పాండురంగ,జి శ్రీలక్ష్మి, తేతలి తపస్వి లక్ష్మి(రాయవరం) కు స్వామి వివేకానంద ప్రతిభా పురస్కారాల పేరిట నగదు 15,10,5 వేలు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, స్వామీజీ సాహిత్యం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నల్లమిల్లి బుల్లి మోహన్ రెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ నల్లమిల్లి సుగుణ (కాకినాడ), జిపిఆర్ఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ గొలుగూరి రామారెడ్డి, డిగ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ నల్లమిల్లి పెద్ద అబ్బాయి రెడ్డి, పి ఆర్ ఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైన పేరుకుపోయిన ఇసుక

-వాహనదారులకు ప్రమాదాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట నుండి గోకవరం వెళ్ళే అర్ అండ్ బి రోడ్డులో ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మీచౌంగ్ తుఫాన్ ప్రభావానికి ఎగువ ప్రాంతాల్లోని నీరు దిగువ ప్రాంతాలకు చేరిన విషయం తెలిసిందే. అదే తరహాలో జగ్గంపేట శివారు పోలవరం కాలువ బ్రిడ్జి పై నుండి నీరు దిగువ ప్రాంతంగా ఉన్న జగ్గంపేట పట్టణం వైపుకు చేరింది. అలా చేరిన నీరు కాస్తా కళ్యాణ మండపాలు ఉన్న ప్రాంతంలో నిలిచి పోయింది. వర్షాలు తగ్గడంతో నీరు పోయింది. ఆ నీటితో కొట్టుకు వచ్చిన ఇసుక మాత్రం అక్కడ నిలిచిపోయింది. రోడ్డుపైన ఇసుక నిలచి పోవడం దానికి తోడు కళ్యాణ మండపాలు వద్ద వాహనాలు రద్దీ ఉండటంతో గోకవరం వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వివాహాలు జరిగే సమయాల్లో వాహనాలను రోడ్డు పక్కన నిలిపి వేస్తుంటారు. అలా నిలిపి వేయడంతో పేరుకుపోయిన ఇసుక ప్రదేశం నుండే వాహనదారులు ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో ఇసుక పై నుండి వెళుతూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఇసుకను తొలగించి ప్రమాదాలను నివారించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

కాపు వనసమారాధనలో పాల్గొన్న హెూంమంత్రి తానేటి వనిత

విశాలాంధ్ర-కొవ్వూరు : కార్తీక మాసంలో పూజలు, వన భోజనాలతో పుణ్యఫలం దక్కుతుందని, మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షింపబడతాయని రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. ఆదివారం కొవ్వూరు టౌన్‌లోని నందమూరు రోడ్డులో పెరుమాళ్ల ఉమా గార్డెన్‌లో కాపు బంధు మిత్రుల ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వన సమారాధనకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వనంలో హెూంమంత్రి కార్తీక దామోదర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గార్డెన్‌లో కాపు సంఘం ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరిని హెూంమంత్రి కాసేపు తిలకించారు. ఈ సందర్భంగా హెూంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. కాపుల్లో కొంతమంది అభద్రతా భావంతో ఉండి తమరిని తాము తగ్గించుకోవద్దని, మొదట వారిలో ఉన్న అభద్రతాభావాన్ని తీసివేయాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కొవ్వూరు పర్యటనలో కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం పై కాపు సంఘం నేతలు సీఎం, హెూంమంత్రి లకు కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ మండపం నిర్మాణానికి అనువైన స్థలం, నిర్మాణ ప్రతిపాదనలతో నాయకులు వస్తే పూర్తి సహకారం అందిస్తామని హెూంమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాపు బంధు మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సౌత్ ఇండియా కరాటే పోటీలు

విశాలాంధ్ర- దేవరపల్లి: ఆదివారం దేవరపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సౌత్ ఇండియా కరాటే పోటీలు దేవరపల్లి కరాటే మాస్టర్ జక్కం శెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలలో సుమారుగా 400 మంది ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు కటా మరియు కుమిటే విభాగాల్లో పోటీపడి పతకాలు సాధించారు. ఓవరాల్ ఛాంపియన్షిప్ కప్ ఏపీ కైవసం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కేత శ్రీనివాస్, పరమేశు బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ జి.ఎం. శివప్రసాద్, ఏపీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రవీంద్ర ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థు లందరినీ పలువురు ప్రశంసించారు.

అంబేద్కర్ విగ్రంపై మూత్ర విసర్జన చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర- చాగల్లు : గుంటూరు జిల్లా పొన్నూరులో ఐలాండ్ సెంటర్ లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పై మూత్రవిసర్జన చేసి అవమానకరంగా. ప్రవర్తించిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దుష్ట చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక చట్టం తీసుకు రావాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు., తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాగల్లు మండలం కుంకుడుమిల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇలాంటి దారుణఘటనలు పైగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలను అవమానించటం, కూల్చటం ఇప్పుడు విగ్రహంపైనే మూత్ర విసర్జన చెయ్యటం భారత జాతి సిగ్గుపడాలని వీటికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించి సాంఘిక బహిష్కరణ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో రొక్కలసుబ్బారావు, చిన్నం నాగరాజు. చిన్నం శ్రీను, గాడి రాజ్ కుమార్, కస్సే వీర్రాజు, చిన్నం పరశ రామ్. అక్కాబత్తుల రాజు, చదలవాడ మురళి తది తరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు కారకులవుతున్న ఇంజనీర్లు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలో నాలుగు రోజుల క్రితం భానుగుడి సెంటర్లో అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా ఉన్న శ్రీ రంగరాయ నేమ్ రెసిడెన్సి డామినోస్ పిజ్జా షాపింగ్ కాంప్లెక్స్ నాలుగు అంతస్థుల నుండి సన్ సైడ్ కూలి పక్క బిల్డింగ్‌లో పనిచేస్తున్న పెయింటర్ పై పడడంతో ఐరన్ ఊస బలంగా వీపుపై గుచ్చు కోవ డంతో పెయింటర్ స్పృహ కోల్పోవడంతో తన తోటి కార్మికులు ప్రమాదానికి గురైన పెయింటర్ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటన ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్‌కు బాధిత కుటుంబ సభ్యులు తెలియజేయగా ఆయన ఆదివారం ఉదయం ప్రమాదానికి గురైన పెయింటర్‌ను పరామర్శించి ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భానుగుడిలో అయ్యప్ప గుడిసెంటర్ ఎదురుగా నూతనంగా దుస్తుల షాపు పనులు జరుగుతుండగా అందులో కూలి పనులు చేయడానికి వచ్చిన పెయింటర్ ప్రమాదానికి గురవడం జరిగిందని, పక్కనే ఉన్న శ్రీ రంగరాయ నేమ్ రెసిడెన్సి డొమినోస్ పిజ్జా షాప్ పైన నాలుగు అంతస్తుల భవనం నుండి సన్ సైడ్ బోర్డర్ పడిపోవడంతో అది అక్కడే ఉన్న పెయింటర్ పై వీపుపై పడడంతో ఐరన్ ఊసలు బలంగా గుచ్చుకున్నాయని, ఆ ఊసలు తీయుటకు సర్జరీ చేశారని ప్రసాద్ అన్నారు. ఇది కేవలం బిల్డింగ్ నిర్మాణ లోపం అని, నాణ్యతలేని కట్టడాలు కట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపట్టి లక్షలకొద్దీ అద్దెలు వసూలు చేస్తున్నారని, ఇలాంటి నాణ్యతలేని నిర్మాణాలపై తనిఖీలు నిర్వహించాలని, యాజమాన్యం, ఇంజనీర్లపై కేసులు నమోదు చేయాలని ప్రసాద్ అన్నారు. ప్రమాదానికి గురైన పెయింటర్‌కు న్యాయం జరిగే వరకూ ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రసాద్ అన్నారు. ఇలాంటివి మరొకటి జరగకుండా కొత్తగా కన్స్ట్రక్షన్ చేసే బిల్డింగ్ నిర్మాణాలు గానీ, పాత అపార్ట్మెంట్లు గానీ తనిఖీలు నిర్వహించి, నిర్మాణాల్లో లోపాలుంటే వెంటనే సరి చేసుకునేలా అధికారులు సూచనలు సలహాలు ఇవ్వాలని ప్రసాదన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

పతకాలు ప్రదానం చేసిన వీసీ, అధికారులు

విశాలాంధ్ర - రాజానగరం : ఆదికవి నన్నయ వర్సిటీలో జరుగుతున్న సౌత్ అండ్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో క్రీడాకారులు తమ సత్తాను చాటు కున్నారు. మండలం లోని నన్నయ వర్సిటీలో జరుగుతున్న క్రీడా పోటీలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులు ఆయా కేటగిరీలలో బరువులను ఎత్తారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ క్రీడాకారులకు వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, క్రీడా ప్రముఖులు పతకాలు ప్రదానం చేసారు. సౌత్ అండ్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2023-24 వివిధ కేటగిరి లలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రీడా ప్రముఖులు ఎబయు అబ్జర్వర్ మజర్ ఉల్ ఖమర్, అర్జున అవార్డీ నీలంశెట్టి లక్ష్మి, వెయిట్ లిఫ్టింగ్ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్ వర్మ, కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి, కె.సుబ్బారావు, కె.రమణేశ్వరి, వి.పెర్సిస్, బడేటి వెంకటరామయ్య, శ్యామ్ కుమార్, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు పంటకు అపారనష్టం

విశాలాంధ్ర-దేవరపల్లి: తుపాను వల్ల పొగాకు పంటకు అపార నష్టం కలిగింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చేతికి అందివచ్చే సమయంలో తుఫాను వలన దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి మొక్కలు వాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అఖిల పక్ష సమావేశానికి హాజరు కండి

రైతులకు అఖిలపక్ష నేతల పిలుపు

విశాలాంధ్ర - అమలాపురం : మిచౌంగ్ తుఫాన్ వలన రాష్ట్రంలో భారీ నష్ట వాటిల్లింది. దీనిని జాతీయ విపత్తుగా పరిగణించి నష్టపరిహారం ఎకరాకు 50 వేలు చెల్లించాలి. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను, గ్రామీణ చేతి వృత్తులు వారిని ప్రభుత్వం ఆదుకోవాలి అని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి, ఈ నెల 14వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టాలని రాష్ట్ర అఖిల పక్షం నిర్ణయించింది. ఇందులో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, గ్రామీణ ప్రాంతాల చేతి వృత్తులు వారు, పాడి పశువుల పెంపకం దారులు, పేద ప్రజలు, వివిధ ప్రజా సంఘాలు వారు ఈనెల 14 తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాకు సమీకరించి జయప్రదం చేయాలని రాష్ట్ర అఖిలపక్షం పిలుపు ఇచ్చింది. సోమవారం ఉదయం 11 గంటలకు డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశం డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కళ్యాణమండపం, అమలాపురంలో ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో సిపిఐ, సిపిఐ(యం), కాంగ్రెస్, టిడిపి, జనసేన, రిపబ్లికన్ పార్టీ, బియస్పి పార్టీలు, వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని అఖిలపక్షం కోరింది.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వ అండ

విశాలాంధ్ర - దేవరపల్లి : తుఫాను వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని దేవరపల్లి ఎంపీపీ కెవికె దుర్గారావు అన్నారు. ఆదివారం దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఇటీవల కురిసిన తుఫాన్ వల్ల దేవరపల్లి యూనియన్ బ్యాంక్ వెనుక భాగంలో ఉన్న ఇల్లు మునిగిపోయింది. ఒక ఇల్లు పడిపోయింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, మంచి నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు 8 కుటుంబా లకు ఆదివారం దేవరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గోపాలపురం ఎఎంసీ చైర్మన్ జి. జనార్ధన్‌రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు సర్పంచ్ కడిమి వీర కుమారి సొసైటీ అధ్యక్షులు కావాల శ్రీనివాస్, మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, మండల సొసైటీ అధ్యక్షులు గడ జగదీష్ గుత్తికొండ. అచ్యుత రావు పార్టీ నాయకులు డి గంగాధర్ పచ్చ రాంగోపాల్ కడిమి రాజు ఆచంట సురేష్ సిద్ధ సూర్యరావు ఆర్ఐ వెంకటేశ్వరా మాట్లాడుతూ మండలంలో తుఫాను వల్ల 23 మందికి 25 కేజీలు బియ్యం చొప్పున నిత్యవసర వస్తువులు అందించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కె. వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తా

విశాలాంధ్ర - గోకవరం : జగ్గంపేట నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా సాగుతున్న నేపథ్యంలో ఆ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమని బడుగు బలహీన వర్గాల ప్రజా నాయకుడు కంచు మూర్తి రాజశేఖర్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనను కృషి చేస్తానని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించి ప్రజల శ్రేయస్సు కొరకు తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన తెలంగాణ ఆడబిడ్డ బర్రె లక్కను ఆదర్శంగా తీసుకుంటానని తెలిపారు. ఆమె ఓడిపోయినా ఓటమిని సైతం స్వాగతిస్తూ తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. తెలంగాణ ఆడపడుచు గౌరవ సీతక్కను ప్రతి ఒక్కరు గౌరవించి ఆమెను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ప్రజలదేనని కొనియాడారు.

కొత్తపల్లిలో ఘనంగా కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో తెలగా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 3000 మంది పాల్గొన్నారు. సుమారు పది రకాల వంటకాలతో వన సమారాధన నిర్వహించారు. కొత్తపల్లి గ్రామంతో పాటు మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు ఈ కార్యక్రమంలో అధికంగా పాల్గొన్నారు. దీంతో సూరంపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డులో కాసేపు ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది.

రెడ్డిల మధ్య పెరిగిన ఐకమత్యం

విశాలాంధ్ర - అనపర్తి : సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా సంక్రాంతి ముందే వచ్చిందా అనే రీతిలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన అత్యంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గి రెడ్డి, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి,గతంలో కంటే రెడ్డిల మధ్య ఐక్యమత్యం పెరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, కులంకంటే సమాజంలో ఉన్న పేదవారికి ఉపయోగపడాలనే ఆకాంక్షతో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం కృషి చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్తిక మాసం చివరి ఆదివారం దుప్పలపూడి నేషనల్ వెంకటరెడ్డి మామిడి తోటలో కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. సుమారు 25 వేలమంది వనసమారాధనలో అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన కోస్తాంధ్ర రెడ్డి సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, కోశాధికారి మల్లిడి సూరారెడ్డి, మహిళా అధ్యక్షులు నల్లమిల్లి కాంతమ్మ,యువజన సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, యువజన ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల కలికి రెడ్డిని పలువురు అభినందించారు.

పాఠశాల మైదానం ఇలా - ఆడుదాం ఆంధ్ర ఎలా?

విశాలాంధ్ర - సీతానగరం: పాఠశాల మైదానం ఇలా - ఆడుదాం ఆంధ్ర ఎలా? అంటూ ప్రజల్లో అనేక సందేహాలు. మండలంలో సీతానగరం గ్రామంలోని పువ్వాడ అచ్చమాంబ మెమోరియెల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఒక ప్రక్క ఇసుక మేటలు, మరో ప్రక్క పూర్తి కాని ఇండోర్ స్టేడియం. మండలంలో గల రఘుదేవపురం, వేదుళ్లపల్లి, వంగాలపూడి, చినకొండేపూడి గ్రామాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మైదానాల పరిస్థితి నాడు నేడు పనుల వల్ల అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం పిచ్చి మొక్కలు, సగం పూర్తి అయిన కంపౌండ్ గోడ నిర్మాణంతో దారుణంగా ఉంది. ఇలా మండలంలో కళాశాలలు, పాఠశాల మైదానాల పరిస్థితి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఏ విధంగా ప్రజాదరణ పొందుతుందని ప్రజలు, క్రీడాకారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దాదాపు సంవత్సర కాలముగా సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇసుకమేటలు తొలగించడానికి అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టలేదంటూ క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పై అధికారులు చర్యలు చేపట్టి క్రీడాకారులకు క్రీడలు ఆడుకునే మైదానాలను అందించాలని ప్రజలు, క్రీడాకారులు కోరుతున్నారు.

దళిత నేత వడ్డీ నూకరాజు మృతి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : యు కొత్తపల్లి మండలం కొత్త మూలపేట గ్రామంలో పొన్నాడ మాజీ సర్పంచ్, దళిత నేత వడ్డి నూకరాజు ఆదివారం తెల్లవారు జామున, కెఎస్ ఇజెడ్ గ్రామంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటివద్దనే ఉంటున్నారు. ఎన్నో దళిత సంఘాల్లో పదవులు నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఎన్నో సేవకార్యక్రమాలు చేసిన వ్యక్తిగా గ్రామంలో మంచి గుర్తింపు ఉంది. ఆయనకి భార్య ,నలుగురు కుమార్తెలు సంతానం. చివరిగా తండ్రికి తలకొరివి పెట్టిన రుణానుబంధం నలుగురు కుమార్తెలు తీర్చుకున్నారు. ఆయన మృతికి చింతిస్తూ కుటుంబానికి సంతాపం తెలిపినవారిలో వైఎస్ఆర్సిపి పార్టీ మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, కెఎస్ఇజెడ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాటూరి చిన అబ్బాయి, మాతా కుమార్, వాకతిప్ప పంచాయతీ సభ్యుడు దాకే సింహాచలం, రాయుడు శ్రీనివాసరావు, దుళ్ళ కృష్ణమూర్తి కొత్త మూలపేట 12 గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: టిడిపి అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. ఆదివారం రాజమండ్రి రూరల్ బొమ్మూరు గ్రామంలో టిడిపి ఓటర్ వెరిఫికేషన్, బాండ్స్ పంపిణీ కార్యక్రమం, సమీక్షలో మాజీ ఎమ్మెల్సీ అంగర పాల్గొన్నారు. స్వయంగా ప్రజలలో తిరిగి పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ ప్రెసిడెంట్ మచ్చేటి ప్రసాద్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తేమశాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-ఆచంట: తేమ శాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆచంట, వేమవరం, భరోసా కేంద్రం వద్ద రైతులు ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్టుగా తేమతో సంబంధం లేకుండా రైతు భరోసా కేంద్రం ఆమోదించిన తేమ శాతానికి కట్టుబడి రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులను మిల్లు యజమానులు ఇబ్బంది పెట్టకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. మిచౌంగ్ తుఫాను రైతులను నిండా ముంచిందని, పంట చేలల్లో ఉండగానే ముంపుకు గురైందని నష్టం బాగా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న ,సన్న కారు, కౌలురైతులకు దాళ్వా సాగుకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని, సబ్సిడీపై ఎరువులు పురుగు మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో మెలగడం ఉత్తమ సాంప్రదాయం

విశాలాంధ్ర - పాలకొల్లు: సమాజంలో ఒక సామాజిక వర్గీయులు ఐక్యతను చాటుకునేలా ఒక చోట కుటుంబ సభ్యులతో కార్తీక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమ సాంప్రదాయమని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు లజపతిరాయ్ పేట క్షత్రియ కళ్యాణమండపంలో క్షత్రియుల ఆధ్వర్యంలో, స్థానిక ఏఎంసి మార్కెట్ యార్డులో శ్రీకృష్ణ యాదవ సంఘ ఆధ్వర్యంలో, పెద్ద సాయిబాబా గుడి రోడ్ లో అడబాల గార్డెన్స్ లో శ్రీకృష్ణదేవరాయ సంఘ ఆధ్వర్యంలో, శిడగం సత్యనారాయణ లేఅౌట్ లో తెలుకుల సంఘ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అందర్నీ ఆప్యాయతతో పలకరించారు. సంబంధిత కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆలోచనా రహిత స్థితి పొందవచ్చు

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రభోదించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం ప్రతిరోజూ చేయడం ద్వారా ఆలోచనా రహిత స్థితిని పొందడం జరుగుతుందని రావులపాలెంకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీమతి వి.ధరణి అన్నారు. స్థానిక శ్రీ సీతారామస్వామి వారి దేవస్థాన ప్రాంగణం లో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానశిక్షణ ద్వారా నాడీమండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యం పొందుతామని, ప్రతిఒక్కరూ ధ్యానంతో పాటు మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలన్నారు. ధ్యానం సర్వరోగ నివారణి,సర్వ భోగకారిణి, సత్య జ్ఞాన ప్రసాదినని, పిరమిడ్ జ్ఞానరత్నాలు, సంకల్పశక్తి గూర్చి చక్కగా వివరించారు. ప్రతిఒక్కరూ ధ్యానసాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, ఎం.కృష్ణారావు, సన్నిధి ఉదయ్, వగ్రివిశ్వేశ్వరరావు, కృష్ణవేణి, సబ్బారపు కమల, భ్రమరాంబ, బోళం యర్రాయమ్మ, జామి పైడమ్మ, బుడబళ్ళ శ్రీదేవి, తదితరులు పాల్గొని సామూహిక ధ్యానం చేసారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రెండవ అంతర్జాతీయ తెలుగు మహా సభలను విజయవంతం చేయాలని అంతర్జాతీయ తెలుగు మహాసభ పోలవరం నియోజకవర్గం కన్వీనర్ రొక్కాల నాగరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం కొయ్యలగూడెం పట్టణంలో జరిగిన కాపు వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కరాటం రాంబాబు, జెట్టి గురునాధరావు ల చేతుల మీదుగా "ఆంధ్రమేవ జయతే" తెలుగు మహాసభల గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వచ్చే జనవరి 5,6,7,తారీకులలో రాజమహేంద్రవరంలో గోదావరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు హాజరయ్యి విజయవంతం చేయాలని ఆయన కోరారు. గోడపత్రికలు ఆవిష్కరించిన వారిలో తాడికొండ మురళీకృష్ణ, దుగ్గిన శ్రీను, పారేపల్లి రామారావు, పైడిముక్కల కృష్ణ, జుంగ బాబ్జి,తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు వనభోజనాలు నిదర్శనం

విశాలాంధ్ర-పెనుగొండ: ఆత్మీయతకు వనభోజనాలు నిదర్శనంగా నిలుస్తాయని ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు, పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం పెనుగొండలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కునపరెడ్డి నానాజీ నిర్వహించిన తాండ్ర పాపారాయుడు వనసమారాధన కార్యక్రమంలో శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజుమాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక వన సమారాధన పేరుతో సమావేశం అవడం వలన మానసిక ఉల్లాసం, ఆనందం కలుగుతాయి అన్నారు. అభిమానం ఆప్యాయతలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా-ప్రధానమంత్రి పసల బీమా యోజన

- ఇకపై నోటిఫై చేసిన పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా ఒకే రీతిలో బీమా రక్షణ
- ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే వర్తింపు
- పంటలవారీగా నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర-ఏలూరు: డా.వైఎస్ఆర్ ఉచిత పంటల భీమాను కేంద్రప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి పసల భీమా యోజనతో సంయుక్తంగా అమలు చేసే పథకానికి సంబంధించి 2023-24 ఖరీఫ్ రబీ సీజన్ లో ఈ పథకాన్ని అమలు చేసే భీమా కంపెనీలు, భీమా వర్తించే పంటల వివరాలను ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భీమా పథకం ద్వారా నోటిఫై చేసిన పంటలను సాగుచేసి ఇ-క్రాప్ నమోదు, ఇ-కేవైసి పూర్తిచేసిన రైతులందరికి ఎటువంటి అదనపు శ్రమ, ప్రత్యేక నమోదు అవసరం లేకుండా కేవలం ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ ఆధారంగా ఉచితంగా పంటల బీమా రక్షణ కల్పిస్తుంది. నోట్ ఫై చేసిన పంటలు పండిస్తున్న రైతులందరూ వారి పంటల వివరాలను ఇ-క్రాప్, రైతు ఇ-కేవైసి, సోషల్ ఆడిట్ విజయవంతంగా పూర్తయిన తర్వాత ఈ కవరేజికి అర్హులు. రైతులు ప్రీమియం రుసుము ఏమి చెల్లించనవసరం లేదు. దిగుబడి ఆధారిత పథకం కింద ఏలూరు జిల్లాలో ఓరియంటల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తున్న భీమా కంపెనీగా వ్యవహరిస్తుంది. వాతావరణ ఆధారిత పథకం యూనివర్సల్ సోంపో జిఐసి లిమిటెడ్ అమలు చేసే భీమా కంపెనీగా వ్యవహరిస్తుంది. ఏలూరు జిల్లాలో 2023 ఖరీఫ్ కాలానికి దిగుబడి ఆధారిత కింద వరి పంటను గ్రామం యూనిట్ గా, మినుములను జిల్లా యూనిట్ గా వాతావరణ ఆధారిత కింద పత్తి పంటను మండల యూనిట్ గా తీసుకోవడం జరుగుతుంది. 2023-24 రబీ కాలానికి దిగుబడి ఆధారితంగా వరి పంటను గ్రామం యూనిట్ గా, మొక్కజొన్నను మండల యూనిట్గా, పెసలు పంటను మండల యూనిట్గా, మినుము పంటను మండల యూనిట్గా తీసుకోవడం జరుగుతుంది. సిజనల్ క్రాప్స్ లో 2023-24 రబీ కాలానికి వేరుశెనగ, నిమ్మ పంటలను మండల యూనిట్ గా తీసుకోవడం జరుగుతుంది. కొన్ని జిల్లాల్లో పెరిగిన సాగు విస్తీర్ణాన్నిబట్టి కొత్త పంటలను బీమా పరిధిలోకి తెచ్చారు. ఈ మేరకు మార్గదర్శకాల్లో మార్పులు చేయడమే కాకుండా, ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే అమల్లోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సాధారణంగా ఇరిగేటెడ్, నాన్ ఇరిగేటెడ్ కేటగిరీల్లో పంటలు సాగవుతుంటాయి. పూర్వం నుంచి ఇరిగేటెడ్ (నీటి వసతి కల్గిన) విభాగంలో సాగయ్యే పంటలను దిగుబడి ఆధారితంగా, నాన్ ఇరిగేటెడ్ (వర్షాధారం) కేటగిరిలో సాగయ్యే పంటలను వాతావరణ ఆధారితంగా పరిగణనలోకి తీసుకొని బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. నోటిఫై చేసిన జిల్లాల్లో ఖరీఫ్లో మిరప, పసుపు జొన్న పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా పూర్తిగా దిగుబడి ఆధారంగానే పరిగుణిస్తారు. పత్తి, వేరుశనగ పంటలను పూర్తిగా వాతావరణ ఆధారితంగా పరిగణిస్తారు. నోటిఫైడ్ జిల్లాల్లో నిమ్మ పంటలను వాతావరణ ఆధారిత బీమా పరిధిలోకి తీసుకొచ్చారు. నాటిన నాలుగో ఏడాది నుంచి నిమ్మ తోటలకు రబీలోనూ బీమా రక్షణ కల్పిస్తారు.

2023-24 సీజన్ కోసం నోటిఫికేషన్ జారీ

వాతావరణ ఆధారిత పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా బీమా రక్షణ కల్పిస్తోంది. 2023-24 సీజన్ కోసం దేశంలోనే అత్యల్ప ప్రీమియంతో బీమా కవరేజ్కు ముందుకొచ్చిన కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. జిల్లాలవారీగా కవరేజ్ కల్పించే కంపెనీలతో పాటు నోటిఫైడ్ పంటల వివరాలతో ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. ఖరీఫ్ 2023లో 15 పంటలకు దిగుబడి ఆధారంగా, 6 పంటలకు వాతావారణ ఆధారంగా, రబీ 2023--24లో 13 పంటలకు దిగుబడి ఆధారంగా, 4 పంటలకు వాతావరణ ఆధారంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుబడి ఆధారిత పంటలకు ఖరీఫ్లో గ్రామం, మండల, జిల్లా యూనిట్గా బీమా కవరేజ్ కల్పిస్తుండగా, వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం మండలం యూనిట్గా బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. పంటల బీమా లెక్కింపు, పరిహారం చెల్లింపుల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు పంటల బీమా మార్గదర్శకాల్లో కీలకమైన మార్పులు తీసుకొచ్చింది. నీటి వసతి, వర్షాధారం ప్రాతిపదికన కాకుండా ఇక నుంచి పూర్తిగా వాతావరణ, దిగుబడి ఆధారంగానే పంటలకు బీమా రక్షణ ఉంటుంది. నోటిఫై చేసిన జిల్లాల్లో నోటిఫై చేసిన పంటలు నష్టపోయే రైతులకు ఒకే రీతిలో పరిహారం దక్కుతుంది. లెక్కింపులో, చెల్లింపుల్లో ఎలాంటి అసమానతలు ఉండవు.

ఆనందోత్సాహాలతో ఆదిత్య సిబ్బంది వన సమారాధన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన సూరంపాలెం అడ్మిన్ సిబ్బంది కుటుంబ సభ్యులు సీతపల్లి వాటర్ ఫాల్స్ ఉద్యాన వనాల వద్ద సరదా సరదాగా గడిపారు. చిన్నారులు పెద్దలు అనే తారతమ్యం లేకుండా ఆట పాటలతో ఎంతో ఉత్సాహంగా సందడి చేశారు. డాన్స్, సాంగ్స్, మిమిక్రీ, మ్యూజికల్ చైర్స్, లెమన్ మరియు స్పూన్ వంటి పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆదిత్య యాజమాన్యం వారు రవాణా,భోజన వసతులు కల్పించారని,వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి గార్కి,డైరెక్టర్ డా.ఎం. శ్రీనివాస రెడ్డి గార్కి ఆదిత్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కార్తీకమాస వన మహోత్సవం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండల రజక సంఘాల ఆధ్వర్యంలో రజక సంఘం భవనం వద్ద కార్తీక మాస వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయినాపు రపు వెంకట్రావు మాట్లా డుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రజకులందరూ ఐక్యమత్సంగా ఉండి రజక సంఘాలు బలోపేతానికి రజకులందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మమ్మిడివరపు వెంకన్న బాబు, గొల్లపల్లి ధర్మారావు, ముమ్మిడివరపు రాంబాబు, కమిడినాగేశ్వరరావు, ముమ్మిడివరపు లక్ష్మణరావు, వేములవలస అప్పారావు, రజక సంఘం పెద్దలు, రజక సోదర, సోదరీమణులు, యువత తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి కమిటీ మహిళలను సత్కరించిన లోకేష్

విశాలాంధ్ర - జగ్గంపేట : మహాశక్తి కమిటీ మహిళలను యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆదివారం సత్కరించారు. జగ్గంపేట నియోజకవర్గంలో 90 రోజులు మహాశక్తి మహిళా కమిటీ మహిళలు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేసినందుకు వారికి టిడిపి నేత జ్యోతుల నెహ్రూ అధ్వర్యంలో లంచ్ బ్రేక్లో అభినందన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోకేష్తో పాటు మాజీ మంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప ఉన్నారు.

మూత్ర విసర్జన చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర- కొవ్వూరు రూరల్ : గుంటూరు జిల్లా పొన్నూరులో ఐలాండ్ సెంటర్ లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పై మూత్రవిసర్జన చేసి అవమానకరంగా ప్రవర్తించిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దుష్ట చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుతీసుకునేలా ప్రత్యేకచట్టం తీసుకురావాలని బహుజన సమాజ్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ అధ్యక్షులు గూడా సూర్య సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ఇలాంటి దారుణఘటనలు పైగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహలను అవమానించటం. కూల్చటం ఇప్పుడు విగ్రహంపైనే మూత్ర విసర్జన చెయ్యటం భారత జాతి సిగ్గుపడాలని వీటికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించి సాంఘిక బహిష్కరణ చెయ్యాలని డిమాండ్ చేశారు.

రామచంద్రయ్య యాదవ్ను అడ్డుకోవడం హేయమైన చర్య

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు బిసివై కార్యాలయంలో బీసీవై పార్టీ నియోజకవర్గ నాయకులు గొంప శివకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బీసీవై పార్టీ యువత మీడియా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ నాయకులు నైదాన రఘు మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో తీవ్ర పంట నష్టంతో బాధపడుతున్న రైతులను పరామర్శించడానికి షెడ్యూల్ వేసుకున్న భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ పర్యటన అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న బోడె రామచంద్రయ్య యాదవ్కు రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాల వారు మద్దతు నిలవాలని కోరారు. బీసీవై పార్టీ నాయకులు మురుకుర్తి నాగ వినోద్ యాదవ్, కుండల శ్రీను, సానబోయిన ఆదిబాబు, నాగళ్ల గణపతి, గదుల నాని, నాగళ్ల దుర్గ, లొండా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో మెగా దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామ చంద్రపురం గ్రామంలో మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం రామచంద్రపురం గ్రామంలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్, రాజానగరం జిఎస్ఎల్ డెంటల్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా నిర్వహించిన ఈ దంత వైద్య శిబిరాన్ని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజా నాయకుడు, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తుమ్మలపల్లి రమేష్ హాజరై ప్రారంభించారు. ఈ యొక్క మెగా దంత వైద్య శిబిరంలో చుట్టుపక్కల పలు గ్రామాలనుంచి పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరై దంత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారందరికీ ఉచితంగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. దంతాల సంరక్షణ పట్ల పలు సూచనలు,సలహాలతో పాటు మందులను ఉచితంగా అందజేశారు. సుమారు 200 మందికి దంతాలకు సంబంధించి మెరుగైన చికిత్స అందించేందుకు రాజానగరం జిఎస్ఎల్కు ప్రత్యేక బస్సులో తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో రామచంద్రాపురం గ్రామంలో దంత వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులకు, ప్రత్యేకించి జిఎస్ఎల్ హాస్పిటల్స్ చైర్మన్ గన్ని కృష్ణకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరవడంతో విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శేఖర్, తామరాడ సర్పంచ్ తోట అయ్యన్న, ఎంపీటీసీలు గోకడ రాజా, బందారు ప్రసాద్, పలికెల గంగరాజు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

యానంలో వైభవంగా హర హర మహా యజ్ఞం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కేంద్ర పాలిత ప్రాంతం యానంలో స్థానిక శాసనసభ్యులు గొల్లపల్లి శ్రీనివాస అశోక్ లక్ష్మీ స్నేహ దంపతులు చేతుల మీదుగా హర హర మహా యజ్ఞం ఆదివారం ఉదయం నుండి వేలాది మంది భక్తజనుల పాల్గొనగా రంగ రంగ వైభవంగా నిర్వహించారు. యానం పరిసర ప్రాంతాల ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో తులతూగాలని దృఢ సంకల్పంతో ఈ పవిత్ర కార్తీకమాసంలో యానం పెర్రి రోడ్లో ఈ హర హర మహా యజ్ఞం చేపట్టినట్లు కార్యక్రమం నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కొరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకి ప్రారంభమైన పూజా కార్యక్రమంతో హర హర మహా యజ్ఞం మృత్యుంజయ హెూమం తదితర కార్యక్రమాలను వేద పండితుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న యానం పరిసర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులకు పూజ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం సాయంత్రం వరకు కొనసాగిన పూజలు అనంతరం శాంతి కళ్యాణం, జ్యోతిర్లింగార్చన, గౌతమి గోదావరికి పూర్ణ హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలు సందర్భంగా యానం మొత్తం శివనామస్మరణతో హర హర మహాదేవ శంభో అంటూ భక్తులు పెద్ద ఎత్తున వ్యవహార మహా యజ్ఞంలో పాల్గొన్నారు.

గైట్లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు

విశాలాంధ్ర - అమలాపురం : జనవరి 5,6,7,8,9 తేదీలలో రాజమహేంద్ర వరం గైట్లో ఆంధ్రాసారస్వత పరిషత్ చైతన్య. విద్యా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవివి సత్యనారాయణ రాజు(చైతన్యరాజు) తెలిపారు. ఆదివారం సాయంత్రం అమలాపురం కిమ్స్లో సన్నాహక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా చైతన్యరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహణకు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర మంత్రులు గవర్నర్లు, రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నారన్నారు. దీనికోసం ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృత ప్రచారం చేస్తున్నామని అందరు కవులు, మేధావులు తెలుగు భాషాభిమానులకు ఆహ్వానాలు పంపామని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజరాజ నరేంద్రుడు తెలుగు భాష రక్షణకు చేసిన కృషికి కేంద్రమైన రాజమహేంద్ర వరం కేంద్రంగా జరుగుతున్నా అంతర్జాతీయ తెలుగు మహాసభలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగు భాష మీద అభిమానం ఉన్న వారంతా తరలిరావలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి పివి రాఘవులు, మాజీ ఎమ్మెల్యేలు ఎం ఆయాజేవేమా, అయతాబత్తుల ఆనందరావు, పి జగ్గప్పరాజు, పి చిట్టిరాజు, సయ్యపరాజు సత్తిబాబు, దెందుకురి సత్తిబాబురాజు, పినిపే సత్యనారాయణ, ఎంఎస్వి ప్రసాద్, మోకా వెంకట సుబ్బారావు, సరేళ్ల విజయ ప్రసాద్, కిమ్స్ సిఏఓ కె రఘు వర్మ, డిబి లోక్, జంగా రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : సేవా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ అన్నారు. మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక దర్గాపేట బాధ్యత ట్రస్ట్ (మన ఇల్లు)లో వృద్ధులకు పళ్ళు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుంచే నానిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పలకొండ మాట్లాడుతూ సేవా కార్యక్రమం ద్వారా మంచి నడవడిక సాధ్యపడుతుందన్నారు. మానవ హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే మానవ హక్కుల సంఘం ద్వారా పోరాటం చేసి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని అప్పలకొండ అన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టా అప్పారావు, ఎస్ రహమాన్, జుత్తుక అప్పారావు, ఎండి పల్లీభాషా, ఎండి మున్వర్, భళ్లమూడి సూర్యనారాయణమూర్తి, లక్ష్మి, ద్వారపూడి శ్రీను, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - కరప : నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. ఈ దుప్పట్లను కాకినాడ రమణయ్యపేటకు చెందిన అడబాల రత్నప్రసాద్ ఏర్పాటు చేసిన దుప్పట్లను పేదలకు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథం, కూమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే వైసీపీ విజయానికి నాంది

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్రెడ్డికి రానున్న ఎన్నికల్లో విజయానికి నాంది పలుకుతుందని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఏడు పర్యాయాల పాటు నిర్వహించే పాదయాత్రలో భాగంగా ఐదవ రోజు ఆదివారం నిర్వహించిన పాదయాత్ర సామర్లకోట నుంచి పెద్దాపురం మండలం తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి సుమారు 15 మీటర్ల మేర పాదయాత్రను జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిలు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, కౌన్సిలర్ దూది రాజు, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భగా ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, గ్రామ ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు ఆలయ వేద పండితులచే ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో కలిసి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయంలో జగన్మోహన్రెడ్డి మరింత సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సేవలో మరో 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

మురుగునీరు పోయేందుకు చర్యలు

విశాలాంధ్ర- తాళ్ళపూడి : తుఫాన్ కారణంగా ప్రక్కిలంక గ్రామం లో చేరిన మురుగు నీరు పోయేందుకు గాను తాళ్ళపూడి ప్రక్కిలంక గ్రామాల మధ్య తవ్విన ఆర్ అండ్ బి రోడ్డును ఎట్టకేలకు ఆదివారం సిమెంట్ తూరలతో పూడ్చి వేశారు. నియోజక వర్గ ఎస్సి సెల్ నాయకులు యాళ్ల బాబూరావు, ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు పలువురు వైకాపా నాయకులు తదితరులు పనులు పరిశీలించారు.

కాండ్రకోటలో కిరాణా దుకాణం దగ్ధం

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని కాండ్రకోటలో గత అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కిరాణా దుకాణం దగ్ధమై సుమారు రెండు లక్షల రూపాయల మేర ఆస్తినష్టం సంభవించినట్లు పెద్దాపురం అగ్నిమాపకాధికారి శ్రీహరి జగన్నాథం తెలిపారు. శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన పోబోలు సత్యకృష్ణకు చెందిన కిరాణా దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైందన్నారు. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయల మేర ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపకాధికారులు తెలిపారు.

కరాటే పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : సామర్లకోట డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం విక్టరీ షూటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రెండోవ నేషనల్ కరాటే పోటీల్లో ఏలేశ్వరంకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కరాటే మాస్టార్ శిడగం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో స్పర్కింగ్ నందు దిమ్మల మధు కిరణ్ గోల్డ్ మెడల్, దినేష్ కార్తీక్ ఎల్లో మెడల్ సాధించారని అన్నారు. కట విభాగంలో గోల్డ్ సిల్వర్ మెడల్ సాధించారని అన్నారు. విజేతలకు గ్రాండ్ మాస్టర్ ఆర్ మల్లికార్జునరావు, సినీపరిశ్రమలో ఉన్న కరాటే మాస్టార్ లక్ష్మి చేతుల మీదుగా ఈ బహుమతులు అందజేశారన్నారు. విజేతలను పలువురు అభినందించారు.